క్లుప్తంగా

టీటీడీ ట్రాన్స్‌పోర్టు నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన కార్యవర్గం నాయకులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం తిరుపతిలోని కార్యాలయంలో సీక్రెట్ బ్యాలెట్‌తో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.అశోకన్, ప్రధాన కార్యదర్శిగా అశోక్ కుమార్, ట్రెజరర్‌గా విశ్వనాథం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగండి

- బస్సుల కండీషన్ బాధ్యత డ్రైవర్లదే
- మెకానిక్‌లు ప్రతి బస్సును తనిఖీ చేయాలి



చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులతో కండక్టర్లు గౌరవంగా నడుసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రాంతమైన తిరుపతితో పాటు జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలకు దేశ విదేశాల నుంచి భక్తులు వచ్చిపోతుంటారని చెప్పారు. వారితో మర్యాదగా వ్యవహరించాలని వివరించారు. మరోవైపు ప్రయాణికులు కండక్టర్లతో చిల్లర విషయంలో సహకరించాలని కోరారు. ఆర్టీసీ అంటే సురక్షిత ప్రయాణానికి నిదర్శనమన్నారు. ఈ క్రమంలో ప్రతి డ్రైవర్ ప్రయాణం చేయడానికి ముందు బస్సు కండీషన్ చెక్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. మరోవైపు గ్యారేజీకి వచ్చే ప్రతి సర్వీస్‌ను నిశితంగా మెకానిక్‌లు తనిఖీ చేయాలన్నారు. అవసరం అయితే కొత్త విడిభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమిష్టిగా పని చేస్తేనే ప్రమాదాలకు దూరంగా ఉంటూ విజయవంతంగా ఆర్టీసీ నడిపించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

మంత్రి సత్యకుమార్‌కు ఘనసన్మానం



మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న అంబేడ్కర్ లా కళాశాల చైర్మన్ తిప్పారెడ్డి

తిరుపతి సిటీ: రాష్ట్ర ఆరోగ్య, వైద్య, విద్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను స్థానిక అంబేడ్కర్ లా కళాశాల చైర్మన్ తిప్పారెడ్డి ఘనంగా సన్మానించారు. తిరుమల పర్యటనలో భాగంగా సోమవారం మంత్రి తిరుపతికి విచ్చేసిన సందర్భంగా ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వద్ద విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థి సత్య కుమార్ తమ కళ్ల ముందే ఉన్నత స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆశీర్వదించారు.

మంత్రికి సత్కారం

తిరుపతి తుడా : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఇతర కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల సమస్యలను మంత్రికి వివరించారు.

టీబీసీలో కట్లపాము



పాముతో ఫారెస్ట్ సిబ్బంది

తిరుమల: తిరుమలలోని టీబీసీ 50 నంబర్ గదిలో కట్లపాము హడలెత్తించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. తిరుమల ఫారెస్ట్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. టీబీసీ 50వ గదిలో ఒక పాము దూరినట్లుగా యాత్రికులు సమాచారం అందించారన్నారు. ఫారెస్ట్ రేంజర్ కోటి బృందం ఘటనా స్థలానికి చేరుకుని ఆ పామును చాకచక్యంగా పట్టుకున్నారు. ప్రమాదకరమైన కట్లపాముగా గుర్తించినట్లు తెలిపారు. సుమారు నాలుగు అడుగులు పొడవు ఉండవచ్చన్నారు.

కనుల పండువగా ద్రౌపదీ కల్యాణోత్సవం

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజిమ్మాపురం గ్రామంలో వెలసిన ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు సోమవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుస్వామికి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి కల్యాణోత్సవానికి కుమార్‌రెడ్డి, ప్రమీల దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శా స్త్రోక్తంగా కల్యాణోత్సవం వైభవంగా జరిపా రు. భక్తులు తమిళనాడు, కర్ణాటక, మండల పరిధిలోని భక్తులు పాల్గొన్నారు.

హ్యాట్సాఫ్ పోలీసన్నా!

పిట్టగోడపై కూర్చుని అల్పాహారం తింటున్న పోలీసులు





తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ వద్ద ఉన్న ఈద్గా మైదానం వద్ద విధుల్లో భాగంగా పోలీసులు బందోబస్తుకు వచ్చారు. అయితే ఉదయం వారు అల్పాహారం తినడానికి ఇబ్బంది పడుతూ కనిపించారు. వారికి కేటాయించిన ప్రాంతాల్లోనే అల్పాహారం తీసుకోవడం కనిపించింది. డివైడర్లు, ఫుట్‌పాత్‌లు, కుర్చీలు, బస్ షెల్టర్ల వద్ద విధులు నిర్వహిస్తూనే కడుపు నింపుకున్నారు. మరికొందరైతే నిల్చొనే తింటుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. విధి నిర్వహణలో పోలీసులకు తిండి తినడానికి కూడా సమయం ఉండదు. ఒకవేళ భోజనం తినాల్సి వస్తే ఇలా కానిచ్చేస్తుంటారు. ప్రజారక్షణ కోసం పోలీసుల సేవలను చూసి హ్యాట్సాఫ్ పోలీస్ అన్నలూ అంటూ పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



బస్సు షెల్టర్‌లో అల్పాహారం సేవిస్తున్న పోలీసులు



గోడపై పెట్టుకుని అన్నం తింటున్న పోలీసులు

కక్షపూరిత రాజకీయాలు వద్దు

- అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా పని చేస్తాం
- తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, మేయర్ శిరీష

తిరుపతి(అలిపిరి): కక్ష పూరిత రాజకీయాలు చేయబోమని, తిరుపతి అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం తిరుపతి నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని పెద్దకాపు లేఅవుట్‌లో కల్వర్టు, సర్వీస్ రోడ్డు నిర్మాణాలకు ఆయన, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ 11వ డివిజన్ ఇన్‌చార్జ్ కంకణాల రజనీకాంత్ నాయుడు, సామంచి శ్రీనివాస్, పులుగోరు మురళి, కార్పొరేటర్ ప్రవల్లికారెడ్డి, మోహన్ ఎస్వీ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, మబ్బుదేవ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగుల ఉన్నతికి సహకరిస్తా

తిరుపతి(అలిపిరి): దళిత ఉద్యోగుల ఉన్నతికి తాను నిరంతరం కృషి చేస్తానని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా ఏర్పాటైన ఎస్బీఐ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి సహకారం అందిస్తానని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి ఎగ్జిక్యూటివ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి మేడికొండ సునీల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ అధ్యక్షుడు రవీంద్ర నాయక్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీరాములు నాయక్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

త్వరలో అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తాం

తిరుపతి(అలిపిరి): తిరుపతిలో త్వరలోనే నాలుగు అన్నా క్యాంటీన్లను మళ్లీ ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్విమ్స్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. అన్నా క్యాంటీన్ స్థలంలో ప్రైవేటు హోటల్ నిర్వహిస్తుండడం, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానం స్థలాన్ని కబ్జా చేసి హోటల్ నడిపిస్తున్నట్లు గుర్తించారు. అన్నా క్యాంటీన్ల స్థలాలను వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. పేదలకు నాణ్యమైన ఆహారాన్ని అతి తక్కువ ధరకు అన్నా క్యాంటీన్ల నుంచి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, పొలకల మల్లికార్జున్, మహేష్ యాదవ్, రాజారెడ్డి, ముక్కు సత్యవంతుడు, భరణి యాదవ్, సింగంశెట్టి సుబ్బరాయులు, మన్యం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్



రెడ్డివారిపల్లి సమీపంలోని మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చంద్రగిరి: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక రెడ్డివారిపల్లి సమీపంలోని మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ బక్రీద్ పండుగ భక్తిభావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమన్నారు. ఆ అల్లాహ్ ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

23న మడకెద్దులు పుస్తకావిష్కరణ

తిరుపతి కల్చరల్: తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన మడకెద్దులు పుస్తకావిష్కరణ సభ ఈనెల 23వ తేదీన ఉదయం 9.40 గంటలకు ఎస్వీయూ గ్రంథాలయంలోని సెమినార్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు తమటం రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయలసీమ అధ్యయనాల సంస్థ అధ్యక్షుడు భూమన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మధురాంతకం నరేంద్ర, గౌరవ అతిథిగా సినీ గేయ రచయిత, గాయకుడు పుట్టా పెంచలదాసు, ఆత్మీయ అతిథులుగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి రచయితలు, కవులు, భాషాభిమానులంతా హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

తెలుగు భాషపై మక్కువ కల్పిద్దాం



మాట్లాడుతున్న తెలుగు భాషోద్యమ సమితి నేత నాదెండ్ల శ్రీమన్నారాయణ

తిరుపతి కల్చరల్: విద్యార్థుల్లో మాతృభాష తెలుగు పట్ల అభిరుచి, ఆసక్తి, మక్కువ కలిగించేలా తరగతి గదిలో పాఠ్యబోధన సాగాలని తెలుగు భాషోద్యమ సమితి ప్రతినిధి నాదెండ్ల శ్రీమన్నారాయణ తెలిపారు. సోమవారం మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ సమావేశ మందిరంలో తిరుపతి జిల్లా తెలుగు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో పదో తరగతి పాఠ్య ప్రణాళికలు, నూతన తెలుగు పాఠ్యపుస్తకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగించారు. పాఠశాల స్థాయిలో పిల్లల మనస్తత్వాలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థుల గ్రహణశక్తిని గుర్తించి వారు సామర్థ్యాలు సాధించేలా తరగతి గదిలో సృజనాత్మక బోధన చేస్తే భాషపై పిల్లలకు పట్టు వస్తుందన్నారు. విషయ నిపుణులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న, గోవిందయ్య, యువశ్రీ మురళి పాఠాలు, ఇతివృత్తాలు, పాఠ్య బోధన, వ్యాకరణాంశాలు, దిన చర్య, పరీక్షలపై తెలుగు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేక్ మై బేబీ స్కూల్ అధినేత భాస్కర్ రాజు, తెలుగు ఉపాధ్యాయులు జయరాం, ఏడుకొండలు, గురుదేవ్, మూర్తి, శేషగిరిరావు, నరేష్, శరవణ, జ్ఞానప్రసూన, కృష్ణయ్య, రాజేంద్ర పాల్గొన్నారు.

సప్తగిరీశునికి సంకీర్తనలతో నీరాజనం



సంకీర్తనలు గానం చేస్తున్న కళాకారుల బృందం



నామ సంకీర్తన ఆలపిస్తున్న కళాబృందం

తిరుపతి కల్చరల్: నామసంకీర్తనల గానాలాపనతో కళాకారులు సప్తగిరీశునికి భక్తి నీరాజనాలు అందించారు. మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞానకేంద్రంలోని ఆడిటోరియంలో ఏడు రోజుల పాటు తలపెట్టిన నిరంతర సప్తగిరి సంగీత సప్తాహం సోమవారంతో రెండోరోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రం, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రముఖ సంగీత కళాకారులు తమదైన శైలిలో భక్తి నామ సంకీర్తలను ఆలపించి ప్రేక్షకుల హృదయాలను రంజింపజేశారు. ఈ మేరకు తొలుత హైదరాబాద్‌కు చెందిన జొన్నలగడ్డ శ్రీరాం బృందం, తిరుపతికి చెందిన కొమాండూరి వెంకట కృష్ణ బృందం, వై.పరమేశ్వరయ్య, విజయవాడకు చెందిన వేమూరి వేంకట విశ్వనాథశాస్త్రి సుమధురంగా సంకీర్తనలను గానం చేసి శ్రోతలను అలరింపజేశారు. తర్వాత గురజాగ మధుసూదనరావు, మురళీకృష్ణ, పి.శైలజ, చల్లా ప్రభావతి, కొమాండూరి శేషాద్రి బృందాలు ప్రదర్శించిన గాత్ర కచేరీలు సభికులను ఆకట్టుకున్నాయి. తమిళనాడు తిరువణ్ణైక్కవల్ కళాకారులు, చెన్నైకి చెందిన జ్ఞానసురభి మ్యూజిక్ అకాడమీ కళాకారులు, రాజమండ్రికి చెందిన సత్యనారాయణ బృందం సంప్రదాయ నామ సంకీర్తనామృతంతో ఆధ్యాత్మికతను రేకెత్తించారు. కళాబృందాలను నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ ఘనంగా సత్కరించి అభినందించారు.



భక్తి సంకీర్తనలు గానం చేస్తున్న కళాకారులు

శ్రీవారి సేవలో ప్రముఖులు





శ్రీవారిని దర్శించుకున్న సినీనటుడు అజిత్, తిరుపతి కలెక్టర్ ప్రవీణ్ కుమార్

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం సినీ నటుడు అజిత్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ చెన్నంశెట్టి రామచంద్రయ్య, తెలంగాణ ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు, తిరుపతి కలెక్టర్ ప్రవీణ్ కుమార్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

పెద్దశేష వాహనంపై ప్రసన్నుడి వైభవం

- ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు



పెద్దశేష వాహనంపై భక్తులను కటాక్షిస్తున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 6.55 నుంచి 7.25 వరకు మిథున లగ్నంలో వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామాస్మరణల నడుమ ఆలయ ప్రధాన అర్చకులు కంకణభట్టార్, సూర్యకుమారాచార్యులు వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. నూతన వస్త్రంపై గరుత్మంతుడిని లిఖింపజేసి, పూజలు చేసి ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ముక్కోటి దేవతలను 18 గణాలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ఘట్టం ఆంతర్యమని అర్చకులు వివరించారు. అంతకుముందు తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి శుద్ధి, కొలువు, తోమాలసేవ, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణం అనంతరం ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు అర్చకులు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

పెద్దశేష వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు..

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మాడవీధుల్లో స్వామివార్లకు పెద్దసంఖ్యలో భక్తులు నారికేళ కర్పూర హారతులు ఇచ్చారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు చిన్నశేష వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు ఊంజల్‌సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు హంసవాహనంపై స్వామివారు విహరిస్తారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు



తిరుచ్చిపై శ్రీవారు



స్వామివారికి తిరుమంజన సేవ

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీసమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో సోమవారం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. స్వామి అమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేకాలతో విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించారు. గ్రామంలోని యువకులు, మహిళలు ఒకరినొకరు వసంతాల నీటిని పోసుకున్నారు. పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ మునిరంగారెడ్డి, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, ఆలయ పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పండరి భజన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామంలోని మైక్రోవేవ్ స్టేషన్ కాలనీలోని గ్రామదేవత గంగమ్మ జాతరను పురస్కరించుకుని సోమవారం భక్తులు చేసిన పండరి భజన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కాలనీవాసులు పొంగళ్లు పెట్టారు. అనంతరం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.